నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 1 అక్టోబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

తులం బంగారం ఎప్పుడిస్తరు?

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

లబ్ధిదారులతో ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, సెప్టెంబర్ 30 : ఆడ బిడ్డల పెళ్లిళ్లకు కానుకగా ఇస్తామన్న తులం బంగారం ఏమైందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి సర్కారును ప్రశ్నించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జైనూర్, లింగాపూర్ మండలాలకు చెందిన 97 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థికసాయమందించేందుకు ఈ పథకాన్ని తీసుకొచ్చారన్నారు. కాంగ్రెస్ అబద్ధపు హామీలతో గద్దెనెక్కి ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

పట్టుపురుగుల పెంపకంతో అత్యధిక లాభాలు

మాట్లాడుతున్న రాష్ట్ర పట్టు పరిశ్రమ జాయింట్ డైరెక్టర్ లత

జన్నారం, సెప్టెంబర్ 30 : పట్టుపురుగుల పెంపకంతో అత్యధిక లాభాలు సాధించవచ్చని రాష్ట్ర పట్టు పరిశ్రమ జాయింట్ డైరెక్టర్ లత పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పొనకల్ రైతు వేదికలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీతో రైతులు పట్టు పరిశ్రమలను ఏర్పాటు చేసుకొని లాభాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సైంటిస్ట్, సెంట్రల్ స్కిల్ బోర్డు డాక్టర్ వినోద్‌కుమార్‌యాదవ్, టెక్నికల్ ఆఫీసర్లు డాక్టర్ రాఘవేంద్ర, అనిత, డీహెచ్ఎస్‌వో పార్వతి రాథోడ్, ఏడీఎస్‌వో సురేందర్, ఆదిలాబాద్, జగిత్యాల సెరికల్చర్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

జోరుగా దేశీదారు దందా

మహారాష్ట్ర నుంచి జిల్లాలోకి రవాణా

- చెక్‌పోస్టులు లేకపోవడంతో అక్రమార్కులకు కలిసివస్తున్న వైనం
- తక్కువ ధరకే లభిస్తుండడంతో ఆసక్తి చూపుతున్న మద్యం ప్రియులు
- ఇక్కడి వైన్స్‌లకు తగ్గుతున్న గిరాకీ ● ఆందోళనలో నిర్వాహకులు
- సర్కారు ఆదాయానికి గండి ● ఇటీవల 580 బాటిళ్లు స్వాధీనం

కాగజ్‌నగర్‌లోపట్టుబడ్డ దేశీదారు(ఫైల్)

కుమ్రం భీం ఆసిఫాబాద్, సెప్టెంబరు 30 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో దేశీదారు దందా జోరుగా సాగుతున్నది. కొందరు దీనినే వృత్తిగా మార్చుకొని మహారాష్ట్ర నుంచి బస్సులు, రైళ్లలో ఇక్కడి బెల్టు షాపులకు తరలిస్తూ సొమ్ము చేసుకోవడం పరిపాటిగా మారింది. తక్కువ ధరకే దొరుకుతున్న దేశీదారును కొనుక్కునేందుకు మద్యం ప్రియులు ఆసక్తి చూపుతుండగా, ఇక్కడి వైన్స్‌లకు గిరాకీ పడిపోతుందంటూ యజమానుల్లో ఆందోళన కనిపిస్తున్నది.

నాడు అలా.. నేడు ఇలా

జిల్లాలోని రెండు డివిజన్లలో 32 మద్యం దుకాణాలు, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో మూడు బార్లు ఉన్నాయి. గతంలో మహారాష్ట్రలోని చంద్రాపూర్, గడ్చిరోలి జిల్లాల్లో మద్య నిషేధం అమల్లో ఉండగా, సరిహద్దు మండలాలైన సిర్పూర్-టీ, కౌటాల, చింతలమానేపల్లి మండలాలతో పాటు బార్డర్‌లో ఉన్న వాంకిడి మండలంలోని కొన్ని మద్యం దుకాణాల నుంచి మహారాష్ట్రకు మద్యం సరఫరా అయ్యేది. దీంతో ఇక్కడున్న మద్యం దుకాణాలకు భారీగా డిమాండ్ ఉండేది. 2022, జూన్ నుంచి చంద్రాపూర్‌లో మద్య నిషేధం ఎత్తివేయగా, అక్కడి నుంచి దేశీదారును ఆసిఫాబాద్ జిల్లాలోకి సరఫరా అవుతున్నది. దేశీదారు తక్కువ ధరకే లభిస్తుండడంతో దానిని కొనుక్కునేందుకు మద్యం ప్రియులు ఆసక్తి చూపుతున్నారు. ఫలితంగా ఇక్కడి మద్యం దుకాణాలకు గిరాకీ తగ్గి.. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండిపడుతోంది.

90 ఎంఎల్.. రూ. 45కే..

మహారాష్ట్రలో దేశీదారు 90 ఎంఎల్ రూ. 45కే లభిస్తోంది. ఇక్కడ లభించే అదే పరిమాణంలోని మద్యానికి రూ. 90 వరకు ధర ఉంటుంది. పైగా ఇక్కడి మద్యంతో పోలిస్తే దేశీదారులో మత్తు ఎక్కువగా ఉంటోంది. దీంతో కార్మికులు, కూలీలు ఎక్కువగా దేశీదారువైపే మొగ్గుచూపుతుంటారు. ఇదే అదనుగా కొందరు ఈ అక్రమ దందాను కొనసాగిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. రైళ్లు, బస్సుల్లో సరుకుల తరహా సంచుల్లో ఇక్కడికి తీసుకొచ్చి బెల్టుషాపుల్లో విక్రయిస్తున్నారు. వాంకిడి మినహా ఎక్కడా తనిఖీ కేంద్రాలు లేకపోవడం అక్రమార్కులకు కలిసి వస్తోంది. అప్పుడప్పుడు అధికారులు దేశీదారును పట్టుకొని కేసులు నమోదు చేస్తున్నా.. వారి కంటపడినవి మాత్రం అనేకం ఉంటున్నాయి. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో దేశీదారు విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి.

ఇటీవల పట్టుబడ్డ బాటిళ్లు

నాలుగు రోజుల క్రితం కాగజ్‌నగర్ పట్టణంలోని సుభాష్‌నగర్‌లో పెద్ద ఎత్తున దేశీదారు నిల్వలున్నాయన్న సమాచారం మేరకు ఆబ్కారీ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి 580 దేశీదారు మద్యం బాటిళ్ల(90 ఎం.ఎల్)ను పట్టుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 30 వేలు ఉంటుందని టాస్క్ ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి సిర్పూర్, చింతలమానేపల్లి మండలం గూడెం మీదుగా మహారాష్ట్ర నుంచి దేశీదారు పెద్ద ఎత్తున తరలివస్తుందనే ఆరోపణలు వస్తున్నాయి.

ఇటిక్యాల లక్షెట్టిపేట చెరువు

ఈ నెల 13న చెరువు పరిశీలనకు వచ్చిన మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

రియల్టర్ల గుండెల్లో గుబులు

- లక్షెట్టిపేట-ఇటిక్యాల చెరువులకు హద్దులు వేసేందుకు అధికారుల కసరత్తు ● కొన్నేండ్లుగా కొనసాగుతున్న వివాదం ● పట్టదారులకు నోటీసులిచ్చేందుకు సిద్ధం ● ఆక్రమణదారుల్లో ఆందోళన

ఇటీవల చెరువులోని వెంచర్‌లో రియల్టర్లు పోసిన మురం

మంచిర్యాల ప్రతినిధి, లక్షెట్టిపేట, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ) : జిల్లా యంత్రాంగం చెరువుల అక్రమ కట్టడాలపై కొరడా ఝుళిపిస్తున్నది. ఇందులో భాగంగా ఇటీవల లక్షెట్టిపేట-ఇటిక్యాల చెరువులను సర్వే చేసేందుకు నోటీసులివ్వగా, అందులో ప్లాట్లు చేసి విక్రయించిన రియల్టర్ల గుండెల్లో గుబులు కనిపిస్తున్నది. ఇటిక్యాలలో 333 సర్వే నంబర్‌లో 41.30 ఎకరాలు, లక్షెట్టిపేట శివారులో సుమారు 26 ఎకరాల ఈ చెరువులు విస్తరించి ఉన్నాయి. కొన్నేళ్లుగా ఈ చెరువుల వివాదం ఎటూ తేలకుండా పోతున్నది. గతంలో ఈ చెరువులు ఆక్రమణకు గురవుతున్నాయంటూ ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ హద్దులు వేసేందుకు సిద్ధమయ్యారు. కానీ కొంత మేరకు హద్దులు వేసి సగంలోనే తిరిగి వెళ్లిపోయారు. దీంతో అప్పటికే ఈ ప్రాంతంలో రియల్టర్లు, భూ పట్టాదారులు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో ప్లాట్లు వేసి విక్రయాలు చేపట్టారు. హైవే పక్కనే ఉండడంతో హాట్ కేకులు ఆ భూములు అమ్ముడుపోయాయి. కొందరైతే ఎఫ్‌టీఎల్ హద్దులను ఆనుకొని భారీ నిర్మాణాలు చేపట్టారు. ఓ ప్రైవేట్ స్కూల్ కాంప్లెక్‌తో పాటు మరో భారీ నిర్మాణం ఎఫ్‌టీఎల్‌ను ఆనుకొని బఫర్ జోన్‌లో ఉండడం గమనార్హం.

హద్దులు వేసేందుకు సిద్ధమై.. వెనుతిరిగిన వైనం

లక్షెట్టిపేట చెరువు, ఇటిక్యాల చెరువు ఈ రెండూ కలిసే ఉంటాయి. ఇటీవల కొందరు రియల్టర్లు అక్రమంగా మురం పోస్తున్నారన్న సమాచారం మేరకు రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, పోలీస్ అధికారులు వచ్చి అడ్డుకున్నారు. చెరువుకు ఎఫ్‌టీఎల్ హద్దులు వేయాలని నిర్ణయం తీసుకుని స్ట్రెంచ్ (కంచె వేయడం) వేసేందుకు సిద్ధం అయ్యారు. స్ట్రెంచ్ వేసేందుకు జేసీబీనీ తెప్పించారు. ఉన్నతాధికారుల నుంచి ఫోన్ రావడంతో పనులు ఆపేశారు. తిరిగి వారం రోజుల్యాక వచ్చి మరోసారి స్ట్రెంచ్ వేసేందుకు సిద్ధమయ్యారు. గతంలో పోసిన మురంను మున్సిపల్ సిబ్బంది సమక్షంలో తొలగించేందుకు ప్రయత్నించగా, ఈ సారి కలెక్టర్ నుంచి ఫోన్ రావడంతో మురం తరలింపు, స్ట్రెంచ్ వేసే పనులను మధ్యలోనే ఆపేసి వెళ్లిపోయారు.

హైకోర్టును ఆశ్రయించిన పట్టాదారులు..

ఆరేళ్లక్రితం ఇక్కడున్న ఒక్కరిద్దరి పట్టాదారులు తమకున్న భూమిని సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. ఇట్టి భూమిలోకి ఎవరైనా రావాలన్నా, నిర్మాణాలు తొలిగించాలన్నా, ఇంకేం చేయాలన్నా నోటీసులు జారీ చేసి, కొంత సమయం ఇచ్చాక రావాలని హైకోర్టు ఆదేశించడంతో ఎవరూ ఈ చెరువుల వైపు చూడలేదు. ఈ క్రమంలో గత 20 రోజులుగా చెరువులకు ఎఫ్‌టీఎల్ హద్దులు వేయాలని, బఫర్ జోన్ నిర్ణయించాలని అధికారులు చెబుతూ వస్తున్నారు. దీంతో బఫర్ జోన్‌లో ప్లాట్లు ఏర్పాటు చేసిన రియల్టర్లు, నిర్మాణాలు చేసుకున్న పట్టాదారులకు ఏం చేయాలలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే రెండుసార్లు అధికారులను అడ్డుకున్నప్పటికీ ఈ సారి దసరా పండుగ అయిపోగానే అధికారులు పట్టాదారులకు నోటీసులు ఇచ్చి ఎఫ్‌టీఎల్ హద్దులు నిర్ణయించి ఆ మేరకు స్ట్రెంచ్ వేయడం పక్కా అని తెలిసింది. దీంతో ఏం చేయాలో తోచక రియల్టర్లు తలలు పట్టుకుంటున్నారు.

నోటీసులు ఇచ్చాకే స్ట్రెంచ్ వేస్తాం

ఇటిక్యాల-లక్షెట్టిపేట చెరువులు కలిపి సుమారు 70 ఎకరాల విస్తీర్ణంలో ఉంటాయి. ఈ చెరువుల చుట్టూ సుమారు 37 సర్వే నంబర్లు ఉన్నాయి. అట్టి సర్వే నంబర్లలో ఉన్న పట్టాదారులందరికీ నోటీసులు ఇచ్చాకే ఎఫ్‌టీఎల్ హద్దులు వేయడం, స్ట్రెంచ్ వేయడం జరుగుతుంది. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ సమన్వయంతోనే కలెక్టర్ ఆదేశాల మేరకు చెరువు చుట్టూ ఉన్న 302 నుంచి 318 సర్వే నంబర్లు, 330 నుంచి 340 వరకు (ఇందులో రెండు సర్వే నంబర్లు మినహా), అదే విధంగా 295, 296, 5,7,8,9,10,11, 20,24,25,26,27 సర్వే నెంబర్లకు నోటీసులు జారీ చేస్తాం.

- కుమార్, ఇరిగేషన్ శాఖ డీఈఈ

మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ఉప్పలయ్య

పాల్గొన్న కౌన్సిలర్లు

రూ. నాలుగు కోట్లతో వైకుంఠధామం

- మంచిర్యాల మున్సిపల్ సమావేశంలో పలు అంశాలపై చర్చ ● మాస్టర్ ప్లాన్ నుంచి 200 ఫీట్ల రోడ్డు తొలగించాలని తీర్మానం

మంచిర్యాలటౌన్, సెప్టెంబర్ 30 : మంచిర్యాలలోని గోదావరి నది తీరంలో రూ. నాలుగు కోట్లతో వైకుంఠధామం నిర్మించాలని మున్సిపల్ కౌన్సిల్ నిర్ణయించింది. ఇందులో రూ. రెండు కోట్లతో వైకుంఠధామానికి ప్రహరీ నిర్మాణం, మరో రూ. రెండు కోట్లతో వైకుంఠధామం అభివృద్ధి పనులు చేపట్టాలని తీర్మానం చేసింది. సోమవారం మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించగా, పలు అంశాలపై చర్చ సాగింది. మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో 200 ఫీట్ల రోడ్డును మాస్టర్ ప్లాన్‌నుంచి తొలగించాలని కౌన్సిల్ తీర్మానం చేసింది. గతంలో పాతమంచిర్యాలకు చెందిన కైలస్ శ్రీనివాస్‌తో పాటు 13 మంది తమ స్థలంలో కమర్షియల్ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని దరఖాస్తులు చేసుకోగా, వారి స్థలం 200 ఫీట్ల రోడ్డు పరిధిలోకి వస్తుందని తిరస్కరించారు. దీంతో వారు హైకోర్టును ఆశ్రయించారు. సేకరించిన భూమికి నష్ట పరిహారం చెల్లించాలని సూచించింది. దీంతోపాటు ఈ 200 ఫీట్ల రోడ్డు నస్పూరు, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీల పరిధిలో కూడా విస్తరించి ఉంది. ఇప్పటికే పలు కాలనీలు, లేఅవుట్ అప్రూవ్‌డ్ భూములు ఈ రోడ్డు పరిధిలోనే ఉన్నాయి. నష్ట పరిహారం చెల్లించడానికి మున్సిపాలిటీలో సరిపడా నిధులు లేనందున ఈ రోడ్డును మాస్టర్ ప్లాన్ నుంచి తొలగించాలని నిర్ణయించిన కౌన్సిల్, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోనున్నది. మున్సిపాలిటీ పరిధిలో చేపట్టే పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం పలికింది. సెప్టెంబర్‌లో అత్యవసరంగా చేపట్టిన పనులకు అయిన మొత్తం రూ. 5 లక్షలను చెల్లించడానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అమృత్ 2.0 స్కీంలో భాగంగా పట్టణాలకు జీఐఎస్ బేస్‌డ్ మాస్టర్ ప్లాన్ రూపొందించడానికి పరిపాలనా అనుమతులు లభించాయి. పలువురు కౌన్సిలర్లు తమ వార్డుల్లో సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. 18వ వార్డు కౌన్సిలర్ హఫీజా మాట్లాడుతూ తమ వార్డులో తాగునీరు సమస్య ఉందని, ఖబరిస్థాన్‌లో పిచ్చి మొక్కలు పెరిగాయని, ఆఖరీసఫర్ వాహనాన్ని ప్రారంభించాలని కోరారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంకం నరేశ్ మాట్లాడుతూ పారిశుధ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, చెత్త వాహనాలకు మరమ్మతులు చేయించాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మహేశ్, కమిషనర్ మారుతీప్రసాద్, ఎంఈ మసూద్ అలీ, ఏఈ రాజేందర్, ఆర్‌వో శ్రీనివాస్‌రెడ్డి, టీపీవో సంపత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉదయ్‌కిరణ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కోటపల్లి పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి, సూచనలు చేస్తున్న సీపీ శ్రీనివాస్

అత్యుత్తమ పనితీరుతోనే గుర్తింపు

- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ ● కోటపల్లి పోలీస్‌స్టేషన్ తనిఖీ

కోటపల్లి, సెప్టెంబర్ 30 : అత్యుత్తమ పనితీరుతోనే పోలీస్‌లకు మంచి గుర్తింపు వస్తుందని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం కోటపల్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. మొదట పోలీస్‌ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా ఉండాలని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సరిహద్దు గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టి నిత్యం తనిఖీలు చేపట్టాలని సూచించారు. సంఘ విద్రోహ శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం సీసీ కెమెరాలను ప్రారంభించారు. చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, కోటపల్లి ఎస్ఐ రాజేందర్‌తో కలసి పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 6,903 కేసుల పరిష్కారం

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 30 : రాజీ మార్గమే రాచ మార్గమని రామగుండం కమిషనర్ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో రామగుండం కమిషనరేట్ పరిధిలో 6,903 కేసులు పరిష్కరించినట్లు పేర్కొన్నారు. పదిహేను రోజులుగా నిందితులకు, కక్షిదారులకు సమాచారం అందించి, అవగాహన కల్పించి కేసుల పరిష్కారానికి కృషి చేసిన పోలీస్ అధికారులను, సిబ్బందిని అభినందించారు. మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన సైబర్ క్రైమ్ కేసుల్లో బాధితులకు రూ.17.01 లక్షలు ఇప్పించేందుకు కోర్టు ఆర్డర్ కాపీలను సంబంధిత బ్యాంక్ అధికారులకు పంపించినట్లు సీపీ తెలిపారు.

నవరాత్రి ఉత్సవాలకు పటిష్ట భద్రత

ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, సెప్టెంబర్ 30 : దుర్గామాత నవరాత్రి ఉత్సవాలకు పటిష్ట భద్రత కల్పించాలని ఎస్పీ శ్రీనివాస్‌రావు సిబ్బందిని ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో నెల వారీ నేర సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాబోయే కుమ్రం భీం జయంతి ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న ఆటోలకు యూనియన్ నంబర్లు కేటాయించాలని, వాటిని అన్ని వైపులా కనబడేలా ఆటోలకి అంటించాలని సూచించారు. ఏదైన సమస్య వస్తే ఆ నంబర్ ద్వారా గుర్తించవచ్చని తెలిపారు. అనంతరం పెండింగ్‌లో ఉన్న కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. గంజాయి, దేశీదారు, గుట్కా రవాణా జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజన్, సీఐలు,ఎస్ఐలు తదితరులు ఉన్నారు.

జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

జిల్లాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు అక్టోబర్ 31వ తేదీ వరకు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ శ్రీనివాస్ రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనుమతి లేకుండా ఎలాంటి బహిరంగ కార్యక్రమాలు, సభలు, ర్యాలీలు నిర్వహించరాదని పేర్కొన్నారు. డీఎస్పీ స్థాయి అధికారి ముందస్తు అనుమతి తీసుకోవాలని తెలిపారు.

డీఎస్సీ ఫలితాల్లో సత్తా

- మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో ర్యాంకులు సాధించిన అభ్యర్థులు
- అచ్చలాపూర్‌కు చెందిన ఆంజనేయులు, అందెవెల్లికి చెందిన శిరీషకు మొదటి స్థానాలు ● ఎల్లూరులో అన్నదమ్ములిద్దరి ప్రతిభ

తాండూర్/బెల్లంపల్లి/కోటపల్లి/కాగజ్‌నగర్/ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్/వాంకిడి/పెంచికల్‌పేట్, సెప్టెంబర్ 30 : తెలంగాణ ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన డీఎస్సీ-2024 ఫలితాల్లో మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల అభ్యర్థులు సత్తా చాటారు. తాండూర్ మండలం అచ్చలాపూర్‌కు చెందిన సత్యనారాయణ-పద్మ దంపతుల కుమారుడు ఏకారి ఆంజనేయులు 76.23 మార్కులతో జిల్లాలో ప్రథమ ర్యాంకు సాధించారు. భౌతికశాస్త్రం (స్కూల్ అసిస్టెంట్) విభాగంలో ఒకే పోస్టు ఉండడం, మొదటి ర్యాంకు రావడంతో కుటుంబ సభ్యులు, మిత్రులు, గ్రామస్తులు ఆయనను అభినందించారు. బెల్లంపల్లి పట్టణంలోని హనుమాన్ బస్తీకి చెందిన జోర్రిగల విజయ్ బయోలోజికల్ సైన్స్‌లో 85.87 మార్కులతో జిల్లాలో మూడో ర్యాంకు సాధించారు. నర్సయ్య, సరోజనల చిన్న కుమారుడు విజయ్ స్థానికంగా పది, ఇంటర్, డిగ్రీ పూర్తి చేశాడు. భువనగిరిలో బీఈడీ చదివారు. ఇప్పటికే టీజీటీ సైన్స్, టీజీటీ బయోలోజిలో ఉద్యోగాలు సాధించారు. తాండూర్ బీసీ బాలుర గురుకుల పాఠశాలలో టీజీటీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఓపెన్‌లో ఆరు పోస్టులుండగా, మూడో ర్యాంకు వచ్చింది. కోటపల్లి మండలం షట్‌పల్లికి చెందిన వేముల శ్వేత మంచిర్యాల జిల్లా స్థాయిలో 23వ ర్యాంక్ సాధించారు. ఎస్జీటీ పేపర్-1లో 79.20 మార్కులు తెచ్చున్నారు.

ఏకారి ఆంజనేయులు

ఆసిఫాబాద్ జిల్లాలో..

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం అందెవెల్లికి చెందిన శివరాం-సంతర్ బాయిల కుమార్తె శిరీష తెలుగు మీడియంలో 86.17 మార్కులతో జిల్లా స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించారు. గ్రామస్తులు, తల్లిదండ్రులు శిరీషను అభినందించారు. ఆసిఫాబాద్ మండలం బూరుగూడకు చెందిన అనుమండ్ల సంతోష్ జనరల్ ర్యాంకింగ్‌లో 12వ ర్యాంకు తెచ్చుకున్నారు. వాంకిడి మండలానికి చెందిన కొట్రాగడే అక్షయ్ జిల్లా స్థాయిలో 3వ ర్యాంకు, గుంపుల గోపాల్ జిల్లా స్థాయిలో 11వ ర్యాంకు, చునార్కర్ భరత్ 27వ ర్యాంకు సాధించారు. పెంచికల్‌పేట్ మండలం ఎల్లూరు గ్రామానికి చెందిన అన్నదమ్ములు అప్పాజీ గణేశ్ (స్కూల్ అసిస్టెంట్) సోషల్‌లో జిల్లా స్థాయిలో రెండో ర్యాంక్, అప్పాజీ సతీశ్ (స్కూల్ అసిస్టెంట్) సోషల్‌లో జిల్లా స్థాయిలో మూడో ర్యాంకు సాధించారు. అప్పాజీ గణేశ్ ప్రస్తుతం లోడ్పల్లిలో ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే నల్గొండ అనిల్‌కుమార్ జిల్లాలో ఎనిమిదో ర్యాంక్ (ఎస్జీటీ) సాధించారు. కొయ్యడ సాయికుమార్ జిల్లా స్థాయిలో 19వ ర్యాంక్ (ఎస్జీటీ)లో సాధించారు. ఈయన ఇప్పటికే సివిల్ పోలీస్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తున్నారు. చెడువాయికి చెందిన నందిపేట అశోక్ జిల్లా స్థాయిలో 23వ ర్యాంక్ (ఎస్జీటీ) సాధించారు. లోడ్‌పల్లి చెందిన కిశోర్ (ఎజ్జీటీ)లో 40వ ర్యాంకు సాధించారు. ఇక ఎల్లూరు గ్రామం నుంచి 8 మంది అర్హత సాధించారు.

మొదటి ర్యాంక్ సాధించిన శిరీషకు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

అమ్మ కావాలి..!

- తల్లికోసం తల్లడిల్లిన శ్రీలత కూతురు అన్విత
- కంటతడి పెట్టించిన చిన్నారి తీరు
- అంత్యక్రియలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన బంధువులు, గ్రామస్తులు
- ఆర్ఎంపీ వైద్యుడిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు

కన్నీరుపెట్టుకుంటున్న కూతురు అన్విత

సీసీసీ నస్పూర్, సెప్టెంబర్ 30 : 'మా అమ్మ ఎక్కడికెళ్లింది.. నాకు అమ్మ కావాలి..' అంటూ పీఎంపీ వైద్యం వికటించి మృతి చెందిన శ్రీలత.. నాలుగేళ్ల కూతురు అన్విత రోదించడం అందరినీ కలచివేసింది. నస్పూర్ నాగార్జునకాలనీకి చెందిన చింతం శ్రీలత ఈ నెల 29న మృతి చెందగా, ఆదివారం అర్ధరాత్రి మృతదేహాన్ని నస్పూర్‌లోని జయశంకర్‌కాలనీలో నివాసముంటున్న ఆమె తల్లిదండ్రుల ఇంటికి తీసుకువచ్చారు. సోమవారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కన్నీటి వీడ్కోలు పలికారు. తల్లికోసం చిన్నారి పరితపించిన తీరు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. కాగా, ఎలాంటి గొడవలు జరగకుండా మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, రూరల్ సీఐ ఆకుల అశోక్ ఆధ్వర్యంలో గోదావరికాలనీ, నాగార్జునకాలనీల్లో సీసీసీ, శ్రీరాంపూర్, హాజీపూర్ ఎస్ఐలతో భారీ బందోబస్తు నిర్వహించారు. మరోవైపు మంచిర్యాల జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు గోదావరికాలనీలో పీఎంపీ ప్రశాంత్ నడిపించే క్లినిక్ వద్దకు వచ్చి వివరాలను సేకరించారు.

ఆర్ఎంపీ వైద్యుడి రిమాండ్

శ్రీలత మృతికి కారణమైన ఆర్ఎంపీ వైద్యుడు బిరుదల ప్రశాంత్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్‌లోని సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ సమావేశంలో సీసీసీ నస్పూర్ ఎస్ఐ సుగుణాకర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రోదిస్తున్న శ్రీలత భర్తను ఓదార్చుతున్న బంధువులు

ఆర్ఎంపీపై కేసు

వాంకిడి,సెప్టెంబర్ 30 : మండలంలోని ధాబా గ్రామంలో అనుమతులు లేకుండా వైద్యం చేస్తూ మందులు అమ్ముతున్న ఆర్ఎంపీ వైద్యుడు కొండల్ సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు వాంకిడి ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు. సోమవారం గ్రామానికి వెళ్లి తనిఖీలు నిర్వహించామని, రూ. 15 వేల విలువైన మందులను స్వాధీనం చేసుకొని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అశ్వినికి అప్పగించామని తెలిపారు. అనంతరం వైద్యుడిని పోలీస్‌స్టేషన్‌కి తరలించారు.